## సందడిగా స్వర్ణోత్సవాలు


స్వర్ణోత్సవాల్లో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

గౌలిపురా: లాల్‌దర్వాజాలోని వెంకట్రావ్ స్కూల్‌లో 1974–75లో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం స్వర్ణోత్సవాలు నిర్వహించారు. చేతి రాత నిపుణుడు ఎజాజ్ అహ్మద్ విద్యార్థులకు అందమైన చేతిరాతపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఉచితంగా చేతిరాత అభ్యాసన పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు జి.వెంకట్‌రెడ్డి, జంగారెడ్డి, సుగుణ, విమల, రుక్మిణి, ఇందిర తదితరులను ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు, విశ్రాంత తహసీల్దార్ కె.రవీంద్ర కుమార్, విశ్రాంత ఏసీటీఓ నారోజు కృష్ణాచారి, పూర్వ విద్యార్థులు మహేందర్, తిరుపతి నర్సింగ్ రావు, విజయ్ కుమార్, మూర్తి, జగదీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పింఛన్ పెంచాలని ఆందోళన


సమావేశంలో వికలాంగులు, వృద్ధులు, వితంతువులు

చార్మినార్: వికాలంగులకు రూ.6000, వృద్ధులు, వితంతువులకు రూ.4000ల పింఛన్లను వెంటనే ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు పంతంగి మంగమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాతబస్తీ బహదూర్‌పురా నియోజకవర్గం వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షురాలు చిన్నగండ్ల ప్రమీల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు పింఛన్లు పెంచి ఇస్తామని మోసం చేసిందన్నారు. ఈ విషయంపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నామన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి పింఛన్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి యాదగిరి నర్సింగ్‌రావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఇన్‌చార్జి తుంపల్లి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శశిశ్రీ

సుల్తాన్‌బజార్: అవయవ దానంపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అడిషనల్ డైరెక్టర్ ( అడ్మిన్) కాకుమాను శశిశ్రీ అన్నారు. అఖిల భారత శరీర అవయవాల సంఘం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ జెల్లి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో అవయవదాన అవగాహన పోస్టర్‌ను డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో ముఖ్యఅతిథిగా హాజరైన శశిశ్రీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అవయవదానం ద్వారా మరణించినా జీవించి నలుగురికి జీవం పోయండని సూచించారు. ఈ పోస్టర్‌లో పార్థివదేహం ఎలా దానం చేయాలి, ఎప్పుడు చేయాలి అని ముద్రించి ఉందని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతగా ఉండాలని కోరారు. జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో దానం చేసేందుకు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుర్రం వెంకటేష్ పాల్గొన్నారు.

## ‘కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆర్థికంగా చితికిపోయింది’


కాంగ్రెస్ నాయకులతో కురాకుల కృష్ణ

గోల్కొండ: కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆర్థికంగా చితికిపోయిందని కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి రాష్ట్రంలో జరుగుతున్న ఇంటింటి సమగ్ర సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము చేయలేని కుల గణనను కాంగ్రెస్ ప్రభుత్వం చేయిస్తున్నందుకు బీఆర్ఎస్‌కు మింగుడు పడడం లేదన్నారు. పదేళ్లు ఇష్టారాజ్యంగా తెలంగాణను దోచుకున్న కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న మంచి పనులకు మేధావులే కాకుండా ప్రజలు సైతం జై కొడుతున్నారన్నారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణను పదేళ్ల పాలనలో కేసీఆర్ అటకెక్కించారని ఆ పని కాంగ్రెస్ చేయిస్తున్నందున ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.చంద్రశేఖర్, రవీందర్, కిషన్, రాములు తదితరులున్నారు.

## నిలోఫర్ ఆసుపత్రి సెక్యూరిటీ ఓవర్ యాక్షన్!

నాంపల్లి: ప్రముఖ చిన్న పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌లో సెక్యూరిటీ సిబ్బంది ఓవర్ యాక్షన్ చేశారు. శుక్రవారం ఉదయం డీఎంఈ వాణి నిలోఫర్ ఆసుపత్రిని సందర్శించడానికి వచ్చారు. ఈ క్రమంలో డీఎంఈ కారును ఆసుపత్రిలోనికి రానివ్వకుండా అక్కడి సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. తాను డీఎంఈ అని చెప్పినా సదరు సెక్యూరిటీ సిబ్బంది ఆసుపత్రి గేటును తెరువకపోవడంపై వారిపై ఆమె సీరియస్ అయ్యారు. ప్రధాన ద్వారం వద్దకు సూపరింటెండెంట్ వచ్చే వరకు డీఎంఈ గేటు వద్దే వేచి ఉండాల్సి వచ్చింది. తర్వాత లోనికి వచ్చిన డీఎంఈ ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తదనంతరం ఒక్కో విభాగాన్ని ఆహ్వానించి చీవాట్లు పెట్టారు. ఆసుపత్రికి ఎవరు వస్తున్నారో తెలుసుకోవాల్సిన అవసరం లేదా అని ఆమె సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుభవం లేని సిబ్బందిని ప్రధాన ముఖ ద్వారం వద్ద ఎందుకు ఉంచారని, శిక్షణ లేని వారిని విధుల్లోకి ఎందుకు తీసుకున్నారో వివరణ ఇవ్వాలని ఆమె సూపరింటెండెంట్‌ను కోరారు. త్వరలోనే కాంట్రాక్టర్‌ను పిలిపించి వివరాలు సేకరించి అందజేస్తానని సూపరింటెండెంట్ అన్నారు.

## గ్రంథాలయాల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి


డాక్టర్ రియాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయల్లో ఖాళీగా ఉన్న లైబ్రరీయన్‌తో పాటు అనుబంధ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ లైబ్రరీ స్టూడెంట్స్, నిరుద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అఫ్జల్‌గంజ్‌లోని కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

## విద్యార్థులకు వ్యాస రచన పోటీ

అఫ్జల్‌గంజ్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేస్తామని ముఖ్య గ్రంథ పాలకురాలు పజీవి రాణి తెలిపారు.


వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

## సీసీ రోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ సర్కిల్-6 ఇంజినీరింగ్ అధికారులు

చార్మినార్: జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధి సర్కిల్–6లోని గాంధీనగర్‌లో రూ.28 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ఈ పాత సీసీ రోడ్డును వారం రోజులుగా పూర్తిగా తొలగిస్తున్నారు. సర్కిల్–6 డీఈ బన్సీలాల్‌తో పాటు ఏఈ వెంకన్న తదితరులు రోడ్డు పనులను పరిశీలించి ఎక్కడ ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కొత్తగా వేసే రోడ్డు సందర్భంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను ఎత్తుపల్లాలు లేకుండా సక్రమంగా ఏర్పాటు చేయాలని సూచించారు. పాడైన మ్యాన్‌హోల్స్ స్థానంలో కొత్త వాటిని వేయడానికి ఇప్పటికే తమ విభాగం నుంచి అవసరమైన కొత్త మ్యాన్‌హోల్ మూతలను అందజేసినట్లు ఆస్మాన్‌ఘడ్ జలమండలి ఏఈ అల్తాఫ్ తెలిపారు.


గుడిమల్కాపూర్ త్రయంబకేశ్వర ఆలయంలో..


గాయత్రినగర్‌లో..


పూజల్లో సంఘసేవకుడు రాజువస్తాద్

# వైభవంగా కార్తీక పౌర్ణమి

- శివనామస్మరణతో మారుమ్రోగిన ఆలయాలు
- ఘనంగా అభిషేకాలు, అర్చనలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు

చార్మినార్: కార్తీక పౌర్ణమి సందర్భంగా మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. వ్రతం అనంతరం భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 6 గంటలకు మహాభిషేకం, అలంకారం, శ్రీ చక్ర అర్చన, స్వామి వారికి రుద్రాభిషేకం, ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, ఆకుపూజ, మంగళహారతి, తులసీ పూజ తదితర పూజా కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి.


శివ్‌బాగ్ శివాలయంలో..

### గుడిమల్కాపూర్‌లో..

అబిడ్స్: కార్తీక పౌర్ణమి వేడుకలు జోరుగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే పలు ఆలయాలు దీపాలంకరణలతో శోభాయమానంగా మారాయి. గుడిమల్కాపూర్ శివ్‌బాగ్ శివాలయంలో ఆలయ నిర్వాహకులు రఘుగౌడ్ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

### భక్తిశ్రద్ధలతో డుప్కీ పున్నమి జాతర

లంగర్‌హౌస్: డుప్కీ పున్నమి జాతర ప్రారంభమయ్యింది. పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో వేద పండితులు రాజ నర్సింహచారి, శ్రీనివాస రమణ ఆధ్వర్యంలో తెల్లవారుజామున స్వామి వారికి నదీస్నానం చేయించి, భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారికి రథోత్సవం నిర్వహించారు. భక్తులు నాగమల్లి చెట్టు కింద, రాంలీలా మైదానంలోని వేప, ఉసిరి కలయిక చెట్టు కింద కార్తీక దీపాలు వెలిగించారు. ఈ పూజల్లో ప్రముఖ సంఘ సేవకులు రాజు వస్తాద్, నాయకులు ఇంద్రసేనారెడ్డి, లింగారెడ్డి, నాగేంద్రప్రకాష్‌రెడ్డి, శోభా పాండే, ప్రకాష్, చంటిబాబు, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

### కోమటివాడిలో..

డబీర్‌పురా: కోమటివాడిలోని రామాలయంలో ఉన్న శివలింగానికి కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం అభిషేకం , విశేష అలంకరణ, అనంతరం దూప దీప నైవేద్యాలతో హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయంలో పూజారి బొంగులూరి రాంమూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో ఈ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రామాలయంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం


సంగం ఆలయంలో నాగమల్లె చెట్టు కింద శివలింగానికి అభిషేకాలు


మీరాలంమండిలో సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు


పూజల్లో భక్తులు


స్పటిక లింగానికి నిత్య పంచామృతాభిషేకాలు


రథోత్సవంలో భక్తులు

## నేడు విద్యుత్ సరఫరా ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ గోషామహల్ రోడ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఏసీపీ కార్యాలయం, శ్మశాన వాటిక, దూద్‌ఖానా తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఫీల్‌ఖానా, ఎంజేమార్కెట్ ఫీడర్ల పరిధిలోని అజీజ్‌ప్లాజా, రంగాచారి లైన్, ప్రేమ్ ప్లాజా, కరాచి బేకరి, రిజిస్టర్ కార్యాలయం, పోస్ట్ ఆఫీస్ లేన్, మాలకుంట తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

గన్‌ఫౌండ్రీ: ఏపీజే అబ్దుల్ కలాం, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను డిసెంబర్ మొదటి వారంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు ఎస్.సరోజనమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమాజంలోని ప్రతి రంగంలో నిస్వార్థ సేవలు అందిస్తున్నవారిని గుర్తించి సత్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. సాహితీవేత్తలు, రచయితలు, సినీనటులతో పాటు వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారిని పలు అవార్డులతో సత్కరించనున్నామని ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 63029 08528 లో సంప్రదించాలని సూచించారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

నాంపల్లి: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాంపల్లి జీఆర్పీ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్–బోరబండ రైల్వే స్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 35 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తు తెలియని యువకుడు శుక్రవారం తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై బూడిద రంగు టీ షర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధీకులెవరైనా ఉంటే నాంపల్లి రైల్వే జీఆర్పీ పోలీసులను లేదా 040–23202238లో సంప్రదించాలని కోరారు.

## వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పొత్తూరి రంగారావు


గన్‌ఫౌండ్రీ: కళాదర్బార్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ జయంతి వేడుకలను ఎలైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళాభవన్‌లో ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అక్కిరాజు రామకృష్ణ (సాహితీవేత్త), కంఠమనేని శివ, ఏస్తర్ నురివా (సినీనటులు), టి.నాగరాజు (ఫ్లూటు విద్వాంసులు), సుధా పద్మిని రాథోడ్ (సామాజిక వేత్త)లకు ఇందిరాగాంధీ జాతీయ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాల చారి, కొప్పుల ప్రవీణ్‌కుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని, సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గాయకులు ఎం.వేణు, రవి కుమార్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

## పసుపర్తి పురుషోత్తమ్ గుప్తా సేవలు అమోఘం


నివాళులర్పిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి, సంతోష్‌గుప్తా, మమతా గుప్తా

అబిడ్స్: తెలంగాణ తొలి ఉద్యమ నాయకుడు స్వాతంత్ర్య సమరయోధుడు పసుపర్తి పురుషోత్తమ్ గుప్తా తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవలు అమోఘమని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర సాధనకు నిరంతరం పోరాటం చేసి తెలంగాణ ఉద్యమానికి పునాది వేసిన ఉద్యమ వీరుడు పురుషోత్తమ్ గుప్తా అని ఆమె కొనియాడారు. గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంతోష్ గుప్తా తండ్రి పసుపర్తి పురుషోత్తమ్ గుప్తా మొదటి వర్ధంతి వేడుకల్లో మేయర్ పాల్గొని నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..తొలి ఉద్యమంతో పాటు మలి తెలంగాణ ఉద్యమంలో కూడా కొన్ని సంవత్సరాల పాటు తెలంగాణ ఉద్యమంలో వీరోచిత పోరాటం చేసిన గొప్ప నాయకుడు పురుషోత్తమ్ గుప్తా అని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మమతా గుప్తా, పరమేశ్వరీ సింగ్, మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## దంపతులకు కౌన్సెలింగ్


ఖాజీ కార్యాలయ సిబ్బందితో హెడ్ ఖాజీ ఆలీముద్దీన్

గోల్కొండ: వివాహం పవిత్ర బంధం అని గోల్కొండ జోన్ హెడ్ ఖాజీ మహ్మద్ ఆలీముద్దీన్ ఉస్సామి అన్నారు. శుక్రవారం నానల్‌నగర్ డివిజన్ మెరాజ్ కాలనీలో ఆయన పలు దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడం సహజమేనన్నారు. వీటిని కుటుంబ పెద్దల సహకారంతో శాంతిపూర్వకంగా పరిష్కరించుకోవచ్చునని ఆయన సూచించారు. భార్యాభర్తల మనస్పర్థలు వారి పిల్లలు, కుటుంబంపై కూడా ప్రభావం చూపుతాయన్నారు. విడిపోవడానికి పోలీసులను ఆశ్రయించే వారికి ప్రభుత్వం కౌన్సెలింగ్ సెంటర్లకు పంపుతుందని ఆయన గుర్తు చేశారు. ఏదేమైనా తమ కలహాలను పాతిపెట్టి పిల్లలతో సుఖసంతోషాలతో ఉండడమే కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ మంచిదన్నారు.

## సర్వేను సద్వినియోగం చేసుకోవాలి



డిప్యూటీ కమిషనర్‌తో కలిసి సర్వే ఫారంను చూపిస్తున్న మీర్ హైదర్ అలీ జాఫ్రీ

చార్మినార్: కుల గణన సర్వేను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మీర్ హైదర్ అలీ జాఫ్రీ కోరారు. ఇప్పటికే సర్వే ప్రారంభమై జోరుగా కొనసాగుతుందన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లోని ప్రజలు తమ తమ ఇళ్ల వద్దకు వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన సమాచారం ఇవ్వడానికి వెనుకంజ వేస్తున్నారనే విషయాలు తెలుస్తున్నాయని.. అలా చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతో పాటు కుల గణన ఎంతో అవసరమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కుల గణనపై జీహెచ్‌ఎంసీ చార్మినార్ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ సరితను కలిసి వివరాలు సేకరించడం జరిగిందన్నారు. ఇళ్ల వద్దకు వచ్చే సర్వే ఎన్యుమరేటర్లకు సహకరించి అవసరమైన మేరకు సమాచారాన్ని అందజేయాలని ఆయన కోరారు.

## విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి


ప్రశంసా పత్రాలు, బహుమతులు అందుకున్న విద్యార్థులు

విజయనగర్‌కాలనీ: విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 14న విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో వివిధ అంశాలలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ఆవరణలో శుక్రవారం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గంగాకిరణ్ మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు వివిధ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలలో శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నవీన్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖురాన్ పఠనంతో మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న మతీన్ ఆలీషా

గోల్కొండ: ప్రతినిత్యం ప్రార్థనలు చేయడంతో పాటు ఖురాన్ పఠనం చేస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆల్ ఇండియా కీరత్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ రిసాలబజార్‌లోని మదర్సా రహమత్ ఉల్ ఉలూమ్‌లో ఖురాన్ పఠనంపై జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త బోధనలు మానసిక ప్రశాంతతను కలగజేస్తాయని అంతేకాకుండా దైవచింతనను పెంపొందిస్తాయన్నారు. ప్రతినిత్యం ఐదు పూటల నమాజ్ ఆచరించిన వారు ఇతరులకు మార్గదర్శకంగా ఉంటూ సమాజంలో గౌరవం కూడా పొందుతారని ఆయన తెలిపారు.

## పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పలువురు సాహితీ ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అచ్చంగా తెలుగు ప్రచురణలు సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి బాలాంత్రపు వెంకటరమణ రచించిన హరవిలాసం–పరిచయం పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..ప్రస్తుత సమాజానికి ఆధ్యాత్మిక పుస్తకాలు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. శ్రీకాళహస్తి మహాత్యం, కళాపూర్ణోదయం, ఉత్తర హరివంశం, రాఘవ పాండవీయం వంటి పుస్తకాలను రచయిత అద్భుతంగా రాశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు నల్లాన్ చక్రవర్తుల శ్రీరామ చక్రవర్తి, కె.నీలకంఠం, అనంతకృష్ణ, సంస్థ అధ్యక్షురాలు పద్మిని తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య వినోబా భావేకు ఘన నివాళి


వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి మనిలాల్ షా తదితరులు

అబిడ్స్: ఆచార్య వినోబా భావే వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో జరిగిన వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా, ఉపాధ్యక్షులు కుమార్‌రావు, మల్లారెడ్డి, విజయవర్ధన్, శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## నూడుల్స్‌లో బొద్దింక..!



నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రి సమీపంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో బొద్దింకతో కూడిన వంటకాన్ని వినియోగదారుడికి వడ్డించారు. నూడుల్స్‌లో పడిన బొద్దింకను చూసిన వినియోగదారుడు ఖంగు తిన్నాడు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ అపరిశుభ్రమైన వాతావరణంలో కొనసాగుతోందని, తినే ఆహారంలో పురుగులు వస్తున్నా పట్టించుకోవడం లేదని వినియోగదారుడు ఆరోపించారు. ఈ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌పై గతంలో కూడా ఫిర్యాదులు ఉన్నాయని, కనీస శుభ్రత, నాణ్యతను పాటించని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరుతున్నారు.